www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 18 ఆగస్టు 2024
5

20 నుంచి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల గ్రామాల్లో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కొండలరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆధార్ క్యాంపు ల ద్వారా బయోమెట్రిక్ అప్ డేట్ 0 టు 5 సంవత్సరాల వయసుగల చిన్నారులకు, న్యూ ఎన్ రోల్మెంట్, డాక్యుమెంట్ అప్ డేట్ చేసుకోవచ్చున్నారు. 20, 21, 22, న తాతపూడి సచివాలయంలో 23, 24.న కపిలేశ్వరపురం -2 సచివాలయంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. అలాగే 20, 21న పడమర ఖండ్రిక, 22, 23న కోరుమిల్లి-1 24న కోరుమిల్లి-2, సచివాలయాల్లో 20, 21న కాలేరు, 22 ,23 .న వద్దమూరు, 24న నేలటూరు. సచివాలయాల్లో ఈ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'వికసిత్ ఆంధ్ర' కోసం ప్రణాళిక

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వికసిత్ ఆంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించడానికి రాబోవు అయిదేళ్లకు జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం అమలాపురం కలెక్టరేట్లో శాఖల వారీగా రాబోవు 5 సంవత్సరాలకు జిల్లా యాక్షన్ ప్లాన్ ను రూపొందించే అంశం పై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2047 లోగా 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారతదేశ అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ... ఈ ప్రయాణంలో రాష్ట్రాన్ని కీలక భాగస్వామిగా మార్చేందుకు వికసిత్ ఏపి విజన్ డాక్యుమెంట్ 2047 ను రూపొందించనున్నారని అన్నారు. దానికి అనుగుణంగా రాబోవు అయిదేళ్లకు జిల్లా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లా అధికారులందరికీ ఆగస్టు 21 నుంచి 31 వరకు రాష్ట్రస్థాయిలో సంబంధిత హెచ్ఓడిలు సమావేశం నిర్వహించి తమ శాఖల ప్రణాళికను రూపొందించుటకు దిశానిర్దేశం చేస్తారన్నారు. జిల్లా కార్యచరణ ప్రణాళికను రూపొందించే క్రమంలో భాగంగా శాఖల వారీగా ప్రతి ఏడాది 15 శాతం వద్ధిరేటు సాధించే విధంగా అయిదు సంవత్సరాలకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని జిల్లా స్థాయిలో అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేయడం పేదరికం నిర్మూలించడం అభివృద్ధి ఫలాలను అత్యంత వెనకబడిన వర్గాలకు తీసుకెళ్లడం లాంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి, సిపిఒ వెంకటేశ్వర్లు, పీడీ డిఆర్డిఎ డాక్టర్ శివశంకర ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, జెడి అగ్రికల్చర్ బోసు బాబు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్

సూర్యఘర్ క్యూఆర్ కోడ్ సెల్ఫీ స్టాండ్ పరిశీలన

అమలాపురం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన క్యూఆర్ కోడ్ సెల్ఫీ స్టాండ్ ను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పరిశీలించారు. క్యూఆర్ కోడ్లను స్కాన్ చేసి ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులు తమ ఇళ్లపై కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందించే సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రతినెల 300 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చు అన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు కాల్ చేయొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎపిఇపిడిసిఎల్ రవికుమార్, పీడీ డిఆర్డిఎ డాక్టర్ శివ శంకర ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మందేశ్వరస్వామిని దర్శించుకున్న కలెక్టర్

కొత్తపేట: మందపల్లిలో శ్రీ మందేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ సహాయకమిషనర్, ఇఒ కె.విజయలక్ష్మి ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించారు.

పూడుకుపోయిన పంట కాలువ

నీరందక రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కుడుపూరు గ్రామానికి చెందిన సుమారు 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని రైతులు తెలియజేస్తున్నారు. ఎర్ర పోతవరం నుంచి శివాల మీదుగా కుడుపూరు వెళ్లే పంట కాలువ పూర్తిగా గుర్రపు డెక్క, చెత్తతో పూడుకుపోయి ఉంది. దీనితో పలువురు రైతులు ఇరిగేషన్ అధికారుల దష్టికి తీసుకువచ్చారు, ఇటీవల ఎర్ర పోతవరం నుండి కొంతమేర గుర్రపు డెక్క ను తొలగించిన మిగిలిన కాలువ పూడిక తీయకపోవడంతో రైతులు ఇక్కట్లు గురవుతున్నారు. ముఖ్యంగా ఎక్కడ జమ్ములమడుగు కాలువ నుంచి కుడుపూరు వరకు కాలువలో పూడిక తీయవలసి ఉంది. ఈ విషయమై ఇప్పటికే కాలువలను శుభ్రపరిచేందుకు చెత్త తొలగించేందుకు కాంట్రాక్టర్లను నియమించిన పనులు ఎప్పటికీ మొదలు కాలేదని కుడుపూరుకు చెందిన ్రైతులు కడియాల వెంకటేశ్వరరావు గుత్తుల శ్రీను, చీకట్ల రామకష్ణ, పిల్లి శ్రీను, తదితరులు తెలిపారు. ఈ కాలంలో గుర్రపుడెక చెత్తను తొలగించి సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని కోరుతున్నారు.

గుర్రపు డెక్కతో నిండిపోయిన శివాల, కుడుపూరు కాలువ

వారం రోజుల్లో గుర్రపు డెక్క తొలగిస్తాం

కుడుపూరు వెళ్లే కాలంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటి కాడ, చెత్తాచెదారం వారం రోజుల్లో తొలగిస్తామని ఇరిగేషన్ ఎఇ సుజాత తెలిపారు. ఇప్పటికే ఈ కాలువల్లో చెత్తను తొలగించేందుకు టెండర్లు పిలిచామన్నారు. కాంట్రాక్టర్లు పనిచేయాల్సి ఉందని ఈ వారంలో వీటిని పూర్తి చేస్తామని దీంతో రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆమె వివరించారు.

రహదారి నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు

ప్రజాశక్తి-అంబాజీపేట

మాచవరం బేతాళ స్వామి గుడి నుండి కోరి వారి అగ్రహారం 3 తూములు వరకూ 1.35 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంలో మూడు కల్వర్టులు నిర్మాణానికి రూ.కోటి వ్యయంతో ప్రతిపాదనలు పంపించామని పంచాయతీరాజ్ ప్రాజెక్టు జెఇ గంగాధర్, పిఆర్ ఎఇ కెవి.కృష్ణంరాజు తెలిపారు. గత 20 ఏళ్ల నుంచి అభివద్ధికి నోచుకోని రహదారి దుస్థితిని పే బేక్ టు సొసైటీ ఆర్గనైజేషన్ తరపున ఫిర్యాదు చేయగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ బందం శనివారం సందర్శించి ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులు,, స్థానిక శాసనసభ్యులకు పంపామన్నారు. ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు మట్టపర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రహదారి ఆధునికీకరణ కు సత్వరమే చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. కార్యక్రమంలో ఆదుర్తి నారాయణమూర్తి, ముత్యాల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాచవరం కోరివారి అగ్రహారం రహదారి ప్రతిపాదనలు చేపడుతున్న పిఆర్ ఎఇ, ఎంపిపి లు

నేడు తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం సర్వసభ్య సమావేశం శం ఈనెల 18న ఆదివారం నిర్వహిస్తారని సంఘ అధ్యక్షులు కట్టా సూర్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు విచ్చేస్తారన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరుకానున్నారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రామచంద్రపురం లోని శెట్టిబలిజ కమిటీ హాల్ నందు ఈ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి పెద్దలు, ప్రతినిధులు, శెట్టిబలిజ నాయకులు హాజరు కావాలన్నారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కట్ట సూర్యనారాయణ, ఇళ్ళ సూర్యనారాయణ, నరాల ఏడు కొండలు, పాలిక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

దేవాలయాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి, ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. భీమనపల్లి లోని దేవాలయాలను శనివారం ఎంపీ హరీష్ , ఎంఎల్ఎ ఆనందరావులు సందర్శించి పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి దేశంశెట్టి నాగరత్నకుమారి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దేశం శెట్టి లక్ష్మీనారాయణ దంపతులు వారికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ హరీష్, ఎంఎల్ఎ ఆనందరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు నాయకులను నాగరత్న కుమారి, లక్ష్మీనారాయణ దంపతులు సత్కరించారు.

ఎంపీ హరీష్, ఎంఎల్ఎ ఆనందరావులకు హారతులు ఇస్తున్న ఎంపిటిసి రత్నకుమారి

20 నుంచి ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండల పరిధిలో అన్ని గ్రామాలలో ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటా సర్వే కి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ జె.వెంకటేశ్వరి అధ్యక్షతన శనివారం బిఎల్ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్ఒలు ఓటర్ల జాబితాను ఇంటింటా తిరిగి పరిశీలించి గ్రామంతరాలు, డెత్ లు, ఒకే ఇంటి పేరుతో పది మంది మించి ఉన్నవి, జెండర్ తప్పులు ఉంటే సరిచేసి 18 ఏళ్ళు పైబడిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం ఎస్ఎస్ఆర్ - 2025 షెడ్యూల్ ను ప్రకటించిందన్నారు. వీటికి సంబంధించి బిఎల్ఒలకు కొన్ని సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్ఐ ఎండి.ఇబ్రహీం, విఆర్ఒలు, బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న భీమారావు

'ఇందుపల్లి' జడ్పి స్కూల్లో కాంప్లెక్స్ సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఇందుపల్లి జడ్పి ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న పాఠశాల సముదాయ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం సమగ్ర శిక్ష ఎపిఒ ఎంఎకె.భీమారావు సందర్శించారు. పేరూరు, బండారులంక, ఇందుపల్లి కాంప్లెక్స్కు సంబంధించి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించే రెండు రోజుల సముదాయ శిక్షణను ఇందుపల్లి హైస్కూల్ హెచ్ఎం విత్తనాల శ్రీనివాస్ అధ్యక్షతన ప్రారంభించారు. భీమారావు మాట్లాడుతూ ప్రభుత్వం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం రెండు రోజుల పాఠశాల సముదాయ శిక్షణ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులంతా పాల్గొనాలన్నారు. బోధన సమర్థవంతంగా చేయుడం, ప్రభుత్వం సమకూర్చిన బోధనా ఉపకరణాలను ఉపయోగించడం, అకాడమిక్ క్యాలండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ సరేళ్ళ దుర్గాదేవి, పాఠశాల సముదాయ జాయింట్ సెక్రెటరీ కెఎన్వి గౌడ, టీచ్ టూల్ అబ్జర్వర్ జిఎస్ఆర్.ప్రసాద్, పేపకాయల రామచంద్రరావు, బిఎస్ఆర్.ప్రసాద్, ఎస్ రవికుమార్, కూరచ రామకృష్ణ, సిఆర్ఎంటి నాగన్న, పేరూరు, ఇందుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘాతుకంపై వైద్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-యంత్రాంగం

కోల్కతా పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిచి పోయాయి. కోల్కతాలో జరిగిన ఘాతుకానికి జిల్లాలో వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు.

అమలాపురం: కోల్కతాలో విధి నిర్వహణలో ఉన్న మహిళా జూనియర్ డాక్టర్ పై జరిగిన అత్యాచారం, దారుణ హత్య ను ఖండిస్తూ కిమ్స్ కళాశాల వైద్యులు వైద్య విద్యార్థులు శనివారం కొవ్వొత్తుల తో నిరసన ర్యాలీ చేశారు. ర్యాలీ లో 600 వందల మంది వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గొలకోటి రంగారావు, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ త్రిపెన్ సోలోపాల్వైద్యులు కూడా పాల్గొన్నారు. కిమ్స్ చైర్మన్ కెవివి.సత్యనారాయణ రాజు, ఎండి రవి కిరణ్ వర్మ కూడా కోల్కతాలోని మహిళా జూనియర్ డాక్టర్ పై జరిగిన దారుణ హత్యనుఖండించారు. **అయినవిల్లి**: ప్రజారోగ్యం కోసం పాటుపడే మహిళా డాక్టర్లకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని అయినవిల్లి పిహెచ్సి వైద్యాధికారిణి బి.మంగాదేవి తెలిపారు. కోల్కతాలో మహిళ ట్రయినీ వైద్యురాలిపై అత్యాచారం ఆపై దారుణంగా హత్య చేసిన సంఘటనకు నిరసనగా పిహెచ్సి వద్ద శనివారం ఒపి సేవలు నిలిపివేసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పిహెచ్సిలో ఎమర్జెన్సీ కేసులు చూస్తున్నామని వైద్యాధికారిణి తెలిపారు. పిహెచ్సి నుంచి ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం 36 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం చాలా దారుణమని దీన్ని ఖండిస్తున్నామన్నారు. ఇకపై దేశంలో ఎక్కడా మహిళా డాక్టర్లపై, మహిళలపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని కోరారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పి.ప్రసాద్రావు, స్టాఫ్నర్స్ లు, పిహెచ్సి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్ లు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** కోల్కతాలో జూనియర్ మహిళా డాక్టర్పై అత్యాచార,హత్య ఘటనను నిరసిస్తూ ఉప్పలగుప్తంలో శనివారం ప్రభుత్వ వైద్య,ఆరోగ్య సిబ్బంది నిరశన చేపట్టారు. తహశీల్దార్ ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ప్రధాన రహదారిపై మానవహారం చేపట్టి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉప్పలగుప్తం, ఎస్.యానం, భీమనపల్లి పిహెచ్సిల వైద్యాధికారులు ఎల్.నాగార్జున, ఢిల్లీ ప్రసాద్, ప్రసన్న,దివ్య జ్యోతి ల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.విజయలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారి విప్పర్తి ప్రసాద్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పిహెచ్సిల సిబ్బంది పాల్గొన్నారు. **రామచంద్రపురం**: కోల్కతా వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య సంఘటన నివసిస్తూ ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా 24 గంటలసేపు వైద్య సేవ నిలిపివేశారు. అత్యవసర సేవల మినహా సాధారణ వైద్య సేవలు సాధారణ ఆపరేషన్ వాయిదా వేశారు. ద్రాక్షారామ ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్యులు నిరసన తెలిపి, బోసు బొమ్మ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు నర్సులు, ఎఎన్ఎంలు ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** కోల్కతాలో జరిగిన జూనియర్ డాక్టర్ పై అత్యాచారం, హత్యా దాడి ఘటనను ఖండిస్తూ శనివారం మండలం పిహెచ్సిలు, సిహెచ్సి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నిరసన, ర్యాలీ, మానవహారం డాక్టర్ రాజకుమార్ , డాక్టర్ చంద్రమౌళి ,డాక్టర్ రాకేశ్ శర్మ, అంగర, తదితర పిహెచ్సిల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** కోల్కతాలో జూనియర్ మహిళా డాక్టర్ పై జరిగిన అత్యాచార, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం ఆత్రేయపురం, ర్యాలీ పిహెచ్సి సిబ్బంది. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.సౌమ్య, డాక్టర్ దుర్గ భవాని, ఆయుర్వేద వైద్యాధికారిని డాక్టర్ విజయకుమారి, సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** కోల్కతాలో పీజీ వైద్య విద్యార్థిని పై అత్యాచారం, హత్య చేసిన దోషులనుశిక్షించాలని ముమ్మిడివరం నియోజకవర్గ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. నగర పంచాయతీ పరిధిలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసున్న వైద్యులు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ముమ్మిడివరం కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యురాలు శ్రుతి, కొత్తలంక పిహెచ్సి వైద్యురాలు శ్రీ పూజా మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుండి జాతీయ రహదారి 216 పై నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఎదుట మానవహారం నిర్వహించారు. డిఎం హెచ్ఒ కార్యాలయం వద్ద సాయంత్రం కొవ్వొత్తుల తో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో టి.కొత్తపల్లి పి హెచ్ సి వైద్యురాలు డయానా పథ్వి, శేరులంక పిహెచ్సి వైద్యులు సుధా రాణి, సూపర్వైజర్ శ్రీనివాసతదితరులు పాల్గొన్నారు. **అమలాపురం (అల్లవరం):** కోల్కతాలో ట్రయినీ డాక్టర్, ఉత్తరాఖండ్లో జరిగిన నర్సు అత్యాచారం చేసి చంపిన ఘటనలను వ్యతిరేకిస్తూ ప్లే కార్డులు ప్రదర్శించిర్యాలీ నిర్వహించారు. అల్లవరం మండలంలో సామాజిక ఆరోగ్య కేంద్రం, గొడిలంక, బెండమూర్లంక పిహెచ్సిల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం, స్థానిక పోలీస్స్టేషనుల్లో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సరోజ, బాలసుబ్రహ్మణ్యం, సుమ, పథ్వీరాజ్, రాకేష్, శాంతి ప్రియ, అమత, మండల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కిమ్స్ వైద్య బృందం



కపిలేశ్వరపురంలో మానవహారంలో వైద్యాధికారులు, సిబ్బంది నినాదాలు

అంబాజీపేట, ముక్కామల పిహెచ్సిల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

అంబాజీపేట: కోల్కతాలో ట్రయినీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులనుశిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అంబాజీపేట, ముక్కామల పిహెచ్సిల వైద్యాధికారి కెఎన్.శ్రీనివాస్, ఎ.సూర్య నగేష్, వైద్యాధికారిణిలు ఎ.ఇంద్రావతి, జివి.గీతాంజలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అంబాజీపేట పిహెచ్సి నుంచి సెంటర్ వరకూ ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లకు, వైద్య సిబ్బంది మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వ డాక్టర్లకు కూడా రక్షణ కల్పించాలని కోరారు.అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పిహెచ్ఎన్, స్టాఫ్ నర్స్, హెల్త్ సూపర్ వైజర్, హెల్త్ అసిస్టెంట్లు ఎంఎల్ పిహెచ్, పిహెచ్సిల వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు. **మామిడికుదురు**: కోల్కతాలోని ట్రయినీ వైద్యాధికారిణిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ నగరం, లూటుకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు రమ్య శైలజ, స్వర్ణలత, స్పందనల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన తెలిపారు. నగరం పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం అందజేసి అచ్చట నుంచి ర్యాలీ గా మామిడికుదురు సెంటరుకు చేరుకొని 216 వ జాతీయ రహదారిపై మానవహారముగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ ర్యాలీలో పిహెచ్సిల సిబ్బందితో పాటు ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని ప్రజా ఆరోగ్యం కోసం పాటు పడే వైద్యులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని కొత్తపేట, రావులపాలెం మండల ప్రభుత్వ, ప్రయివేటు డాక్టర్లు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో వినతి పత్రం అందజేశారు.అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి వెళ్లి ఆర్డిఒ ఆఫీస్ వద్ద నిరసన చేపట్టారు. తదుపరి ఆర్డిఒ జివివి.సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శేషుబాబు, కె.వీర్రెడ్డి, భాస్కర్ నాయుడు, దుర్గావతి, ఎం.గంగిరెడ్డి, భీమారెడ్డి, సుమలత, రమేష్ రెడ్డి, మెంటే ఉదయ్ భాస్కర్, అనూష, తరుణ తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు :** వైద్యుల రక్షణ ప్రభుత్వ భాధ్యతని బతికించే వైద్యులను బలి తీసుకోవద్దని పిహెచ్సి వైద్యాధికారిణి డి.సువర్చల దేవి అన్నారు. కోల్కతా పిజి విద్యార్థిని మౌనిత పై అత్యాచారం హత్య ఘటనపై మండలంలోని చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి ఆమె ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఋతు బాలమణి, ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి, మంగాదేవి, సుజాత, సిహెచ్ఓలు మాదురి, అచ్చమణి, హెలినా రాణి, జాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం పట్టణంలో వైద్యుల నిరసన ప్రదర్శన

ముమ్మిడివరంలో మానవహారంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ఆత్రేయపురంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పలగుప్తంలో నిరసన చేపట్టిన వైద్యాధికారులు, సిబ్బంది

అల్లవరంలో సిహెచ్సి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

మామిడికుదురులో మానవహారంగా ఏర్పడి వైద్యులు, సిబ్బంది నిరసన

అయినవిల్లి పిహెచ్సి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యాధికారిణి, సిబ్బంది

చొప్పెల్ల పిహెచ్సి వద్ద నిరసన తెలుపుతున్న వైద్య బృందం

కొత్తపేట ఆర్డిఒకు వినతిపత్రం చేస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

కొట్లాటపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ రాత్రి మండలంలోని పి.సూరంపాలెం గ్రామానికి చెందిన రెండు సామాజికవర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనపై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తలిపారు. ఈ కేసును డిఎస్‌పి కె.లతాకుమారి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జగ్గంపేట ఎస్ఐ రఘునాథ రావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని జె.కొత్తూరు శివారున ఒక వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. అతని నుంచి 10 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని, నిందుతుడిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్

ప్రజాశక్తి - కరప

కరప మార్కెట్ సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఐషర్ వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఎస్ఐ టి.రామకృష్ణ వెల్లడించారు. అనంతపురం నుంచి టమాటా లోడుతో కాకినాడ వెళ్తున్న ఐషర్ వ్యాన్ కరప మార్కర్ సెంటర్‌లో అతివేగంగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనం ఎదురుభాగం నుజ్జునుజ్జుయ్యింది. కేబిన్‌లో ఉన్న డ్రైవర్ దానిలో ఇరుక్కుపోయాడు. సుమారు రెండు గంటలపాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ శ్రీనివాస్‌కు, క్లీనర్ ఈడిగ భాస్కర్‌కి రక్తపు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి గోదావరిలో స్నానానికి దిగి శుక్రవారం గల్లంతైన యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రామచంద్రపురం మండలం తోటపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కోటిపల్లి గోదావరిలో స్నానానికి దిగారు. వారిలో కందుల నరేంద్ర (26) గోదావరి ఉధృతికి కొట్టుకుపోయాడు. అతను మృతదేహాన్ని శనివారం కనుగొన్నారు. మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి కె.గంగవరం జానీ బాషా దర్యాప్తు చేస్తున్నార.

మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని మర్రివీడు శివారు ఏలేరు రిజర్వాయర్‌లో తల, కాళ్ళు, చేతులు వేరు చేసిన మహిళ మొండెం లభించింది. శనివారం మర్రివీడు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని డిఎస్‌పి లతాకుమారి, ప్రత్తిపాడు సిఐ శేఖర్‌బాబు, స్థానిక ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మహిళను ఈ ప్రాంతంలోనే హత్య చేశారా? కాలువలో కొట్టుకుని వచ్చిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడుకు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కాజులూరు

రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం..ఆర్యవటం నుంచి గొల్లపాలెం సైకిల్‌పై వెళున్న కోట వెంకట్రావు(70)ను పాల వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో జరిగింది. అంగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేదార్లంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కోణాల ఏడుకొండలు (43) శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య ధనలక్ష్మి ఖతర్ దేశం నుంచి 10 రోజుల క్రితమే ఇక్కడికి వచ్చింది .ఆమె మళ్లీ ఖతర్‌కు వెళ్లాలనుకుంటున్నట్లు భర్తతో చెప్పగా పంపేందుకు ఇష్టంలేక ఆమె పాస్‌పోర్టును చింపి వేయడంతో ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఏడుకొండలు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని మండపేట రూరల్ ఎస్ఐ, అంగర ఇన్‌ఛార్జ్ ఎస్ఐ డి.సురేష్‌బాబు శనివారం పరిశీలించి మృతుని కుమార్తె పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల డివైడర్ వద్ద శనివారం ఒక ఇటుక రవాణా వ్యాన్ అదుపుతప్పిన ఘటనలో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని చొప్పెల్లకు చెందిన ఆకుల వెంకన్న, అడబాల సత్యనారాయణ, చిక్కిరెడ్డి రాజు తమ వ్యవసాయ పనులు ముగించుకున్నారు. అనంతరం రెండు వేర్వేరు ద్విచక్ర వాహనాలపై ఇంటికి చేరుకునే క్రమంలో స్థానిక కొండలమ్మ గుడి జంక్షన్ వద్ద డివైడర్ వద్ద ఆగారు. ఇంతలో జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వైపుగా వెళ్లే వాహనం అదుపుతప్పి రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వ్యక్తులను ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీస్, పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో చిక్కిరెడ్డి రాజు పరిస్థితి నిలకడగా ఉండగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

పాఠశాల విద్యా వ్యవస్థకు సర్దుపోటు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాల విద్యా వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటుకు రంగం సిద్ధం చేయటంతో ఉపాధ్యాయులలో ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ ఆదేశాలతో గత వైసిపి ప్రభుత్వం నూతన విద్యా విధానంలో జిఒ నెం.117 అమలు చేసిన విషయం విధితమే. తాము అధికారంలోకి వస్తే ఆ జిఒను రద్దు చేస్తామంటూ ఎన్నికల ముందు టిడిపి పెద్దలు ఇచ్చిన హామీ తాజాగా బుట్టదాఖలైంది. జిఒ నెం.117 ప్రకారం సర్దుబాటు చేయాలని ఇటీవల జిల్లా అధికారులకు ఆదేశాలివ్వటంతో విద్యా రంగంలో కలవరం మొదలైంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల పోస్టులు మిగులు చూపించే ప్రమాదం పొంచి ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మెగా డిఎస్‌సిపైనా ప్రభావం ఉండబోతోందనే చర్చ మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మెగా డిఎస్‌సి ప్రకటించిన నేపథ్యంలో నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. నోటిఫికేషన్ జారీ చేయకపోగా సర్దుబాటు పేరుతో పోస్టుల్లో కోత విధించటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉపాధ్యాయులు ఇప్పటికే ఉన్నతాధికారులకు తమ విజ్ఞాపన పత్రాలను అందజేస్తున్నారు. ఉపాధ్యాయులలో వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది. ప్రభుత్వం పునరాలోచించాలని లేనిపక్షంలో గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తే ప్రజా వ్యతిరేకత ఖాయమనే సంకేతాలు విన్పిస్తున్నాయి,

అన్న క్యాంటీన్లపై రాజకీయ రగడ

రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లపై రాజకీయ రగడ నెలకొంది. ఒకొక్క క్యాంటీన్ మరమ్మతులు పేరుతో రూ. లక్షల్లో వెచ్చించారంటూ వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు కొందరు నేతలు ముఖం చాటేశారు. తమకు ఆహ్వానం అందలేదంటూ అలకబూనారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా కేవలం రూ.15కే మూడు పూట్ల

పేదలకు భోజనం అందించే కార్యక్రమం గడిచిన మూడు రోజుల్లో అత్యధిక మంది వినియోగించుకున్నారు. అన్న క్యాంటీన్లలో నాణ్యమైన భోజనం అందించే క్రార్యక్రమానికి సహకారం అందించాలంటూ కోరిన ప్రభుత్వ విజ్ఞాపనను సహకరించేందుకు ఎంత మంది దాతలు ముందుకు వస్తారో వేచి చూడాలి.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా..?

చౌక డిపోల ద్వారా పేదలకు అందించే బియ్యం పక్కదారి పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఏ మేరకు ఫలితాలను ఇస్తాయో వేచి చూడాల్సి ఉంది. గత ప్రభుత్వ హాయంలో కొందరు అక్రమార్కులు కాకినాడ పోర్టును కేరాఫ్ అడ్రస్‌గా వినియోగించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి సేకరించి పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేసినట్లు సమాచారం. అయితే ఇటువంటి చర్యలను పూర్తిగా కట్టడి చేస్తామంటూ ఇప్పటికే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ పలు మార్లు స్పష్టం చేశారు. తాజాగా కాకినాడ జిలా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశం అనంతరం పలు నిర్ణయాలను ప్రకటించారు. పోర్టులో చెక్‌పోస్టు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తాజా నిర్ణయంతో ఏ మేరకు కట్టడి చేయగలరో వేచిచూడాలి. రేషన్ డిపోల ద్వారా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార ఇతర పలు రకాల నిత్యావసరాలు అందించాలనే డిమాండ్ లబ్ధిదారులలో వ్యక్తమవుతోంది.

మువ్వన్నెల జెండా రెప రెపలు

78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. విధి నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు ఉద్యోగులను జిల్లా కలెక్టర్లు అందించిన ప్రశంసా పత్రాలు వారిలో మరింత ఉత్సాహాన్ని నింపాయి.

గిరిజన సంక్షేమానికి నిరంతర కృషి

ప్రజాశక్తి - కాకినాడ

గిరిజన కుటుంబంతో మాట్లాడుతున్న డిఎన్ మూర్తి

కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నత వైద్య సేవల కొరకు వచ్చే గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటుగా సదుపాయాల కల్పనకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తామని హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ (హెన్) స్టేట్ ప్రాజెక్టు ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డిఎన్.మూర్తి తెలిపారు. శనివారం జిజిహెచ్‌లోని మాతా శిశు విభాగంలోని స్వస్థ పేరిట నిర్వహిస్తున్న గిరిజన రోగుల సహాయకుల నిరీక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా కొయ్యూరు మండలం తీగలమెట్ట గ్రామానికి చెందిన గిరిజన మహిళ బోనంగి జానికి గురువారం రాత్రి మగ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు ఉదర భాగంపై చర్మం ఏర్పడక పోవడంతో పేగులు బయటకు రావడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స చేయడంతో ఆ శిశువుకు ప్రాణాపాయం తప్పింది. ఈ సందర్భంగా గిరిజన నిరీక్షణ కేంద్రంలో ఉన్న జానకి యోగక్షేమాలు తెలుసుకున్న ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారిని కలిసి గిరిజన బాలింత జానికికి కూడా బిడ్డతోపాటుగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆమెను బాలింతల సంరక్షణ వార్డులో చేర్చేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎంవిఆర్.ఫణీంద్ర పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యచరణ

ప్రజాశక్తి - కాకినాడ

క్షేత్ర స్థాయి పరిశీలనలో కమిషనర్ భావన

దోమల నివారణకు ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ వి.భావన తెలిపారు. శుక్రవారం నగరంలోని 9వ సర్కిల్‌లో కమిషనర్ పర్యటించారు. రెవెన్యూ కాలనీ, సంజయ్ నగర్ వంటి ప్రాంతాల్లో డ్రెయిన్లు, నీరు నిలిచిన ఖాళీ స్థలాల్లో డ్రోన్స్ ద్వారా యాంటీ లారా యాక్టివిటీస్‌కు సంబంధించి స్ప్రేయింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు. స్ప్రేయింగ్ ఎలా చేస్తున్నారు? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాకినాడ నగరంలో సుమారు 150 ఎకరాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ఈ యాంటీ లారా యాక్టివిటీస్ చేపడతామని వెల్లడించారు. నగర ప్రజలు తమకు సహకరించాలని, ముఖ్యంగా ఖాళీ స్థలాల యజమానులు తమ తమ స్థలాల్లో నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

టైం టేబుల్‌ను అనుసరించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు టైం టేబుల్‌ను అనుసరించి నిర్వహించాలని ఎంఇఒ-1 శివరామకృష్ణయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని నవర జడ్‌పి హైస్కూల్లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ సమావేశంలో నేర్చుకున్న అంశాలను అవగాహన చేసుకుని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాలు టైం టేబుల్‌ను అనుసరించి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రశున్న, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కించపర్చే చర్యలు తగదు

ప్రజాశక్తి - కాకినాడ

రాక్షస పుత్రిక శూర్పణకు పుట్టిన జాతి అంటూ ముస్లింలను సామాజిక మాధ్యమాల్లో కించపర్చడం సరికాదని స్మార్ట్ సిటీ ముస్లిం వేదిక కన్వీనర్ హసన్ షరీఫ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు పవిత్రంగా ఆరాధించే మక్కా మసీదు ఫోటోతో ఎం.సర్వారాయుడు(77807 72972) అనే వ్యక్తి స్థానిక మెజిస్ట్రేట్ నాని పేరుతో సామాజిక మాధ్యమం(వాట్సప్ గ్రూప్)లో శనివారం 12.26 నిమిషాలకు పోస్టు చేశారన్నారు. గ్రూపు అడ్మిన్ జె.రాజశేఖర్(93902 10773) ఆ పోస్టును తొలగించలేదన్నారు. ముస్లింలను కించపరిచేలా పెట్టిన ఈ పోస్టుపై ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కరప

గ్రామాల్లో చోరీలు జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. శనివారం కరప, పెనుగుదురు, నడకుదురు, వేలంగి తదితర గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా గ్రామం విడిచి వెళ్లే సమయంలో ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియచేయాలన్నారు. ఆ సమాచారంతో మీ మీ గృహాల వద్ద ఎల్‌హెచ్ఎంఎస్‌ను అమర్చుతామని చెప్పారు. బంగారం వస్తువులు వాడుకకు ఉంచుకుని -మిగిలినవి బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకోవాలన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు కానీ, అపరిచితులుకానీ సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

'మత్తు'కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమాజంలో యువత మత్తుకు, చెడు వ్యసనాలకు తొందరగా ఆకర్షితులవుతున్నారని ఎస్ఇబి సిఐ ఎల్.చిరంజీవి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యం, గంజాయి, ఇతర డ్రగ్స్ వంటి వ్యసనాలకు సరదాగా ప్రారంభమై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ తమ పిల్లలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, సురేష్, వీరభద్రరావు, శివప్రసాద్, బంగారు రాజు, మేరీ, పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తే రౌడీ షీట్ తప్పదు

ప్రజాశక్తి - జగ్గంపేట

గ్రామంలో చట్టాన్ని ఉల్లంఘిస్తూ పెట్రేగిపోతే రౌడీషీట్ తెరుస్తామని ఎస్ఐ రఘునాథరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని కాట్రావులపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాన్ని అనుసరించి నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంతమంది ఆకతాయితనంతో ఉద్దేశ్యపూర్వకంగా ఘర్షణలకు పాల్పడితే సహించేది లేదన్నారు. గ్రామాల్లో పేకాట, కోడి పందాలు వంటి జూదాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని, నాటుసారా, మద్యం అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియచేయాలని కోరారు. ఈ సదస్సులో ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2.68 లక్షల ఆదాయం

యాత్రికులకు భోజనాలు వడ్డిస్తున్న స్వచ్ఛంధ సేవకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామానికి చెందిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి వివిధ రూపాల్లో రూ.2.68 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఒకరోజు వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.1,65,620, అన్నదానం విరాళాల ద్వారా రూ.64,874, కేశఖండన ద్వారా రూ.9,560, తులాభారం ద్వారా రూ.550, లడ్డు ప్రసాదం ద్వారా రూ.18,510, కానుకల ద్వారా రూ.9,000 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం మహా అన్నదానం చేసినట్లు చెప్పారు. యాత్రికులకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్త మాచార్యులు, నారాయణాచార్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సేవలందించారు.

కళ్ల ముందే ప్రమాదం... కళ్లు మూసుకుని ప్రయాణం

గండేపల్లి మండలం మల్లేపల్లిలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైకుపై హెల్మెట్ లేకుండా వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డాడు. అతన్ని డివైడర్ మధ్యలో పడుకోబెట్టి అటుగా వెళ్తున్న వాహన చోదకులు సపర్యలు చేస్తున్నారు. అదే సమయంలో మరో వ్యక్తి ఇలా బైకుపై సెల్ ఫోన్ మాట్లాడుతూ హెల్మెట్ కూడా లేకుండా నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ప్రయాణిస్తున్నాడు.

:: ప్రజాశక్తి - గండేపల్లి ::

నిత్యాన్నదానానికి రూ.11వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు



దాతకు స్వామి వారి చిత్ర పటం అందిస్తున్న ఆలయ సహాయ కమిషనర్ మాధవి

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత విరాళం శనివారం అందజేశారు. పాశర్లపూడి బాడవ వాసులు కాంద్రేకుల వెంకటేశ్వరరావు, సూర్యవతి దంపతుల పెళ్లి రోజు ప్రతి ఏటా జూలై 2న అన్నదానము జరిపించు నిమిత్తం రూ.11,111 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. ఆలయ అర్చకులు, సిబ్బంది దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారన్నారు.

ఆత్రేయపురం ఎంపిడిఒగా నాతి బుజ్జి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

నాతి బుజ్జి, ఎంపిడిఒ

ఆత్రేయపురం మండల అభివృద్ధి అధికారిగా నాతి బుజ్జి నియమితులయ్యారు. ఆమె శనివారం బాధ్యతలను స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆమె ఆత్రేయపురం నుండి పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం మళ్లీ తిరిగి ఎంపిడిఒగా బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు పాలకొల్లు వెళ్లారు.

యానాంలో ధర్నా చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్యులు, సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - యానాం

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుషకాండకు వ్యతిరేకంగా శనివారం యానాం వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. శనివారం దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణంలో ప్ల కార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. దోషులను కఠినంగా శిక్షంచాలని, ట్రైనీ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యానాం పరిపాలనాధికారికి, ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్‌కు అందించారు.

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. 152/2023

Between:

సుంకర సూర్య బ్రహ్మానందం -వాది

AND

తిక్కా త్రిమూర్తులు, S/o. ధర్మారావు, 52 సంIIలు, వ్యాపారం, డోర్ నెం. 4-1-30/ఇ, చల్లావారి వీధి, అమలాపురం టౌన్, డాII బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా -ప్రతివాది

యీ నెంబరు దావాలో వాది ప్రతివాది అయిన మీపై ప్రాంశరీ నోటు బాకీ వసూలు నిమిత్తం యీ దావా దాఖలు చేసినారు. సదరు దావాలో మీకు చెందిన షెడ్యూలు దాఖలా ఆస్తిని జప్తు చేయించమని కోరుచూ I.A. 731/2023 పిటీషను దాఖలు చేసినారు. దావాలో I.A. లో శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు మరియు నోటీసులు పంపించిననూ తీసుకొనచున్నందున **ది. 20-8-2024 సంIIరం తేదీకి మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. వాయిదా తేది ఉదయం 10.30 గంIIలకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేది: 20-8-2024

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ముమ్మిడివరం 17-8-2024

చింతపల్లి అజయ్‌కుమార్
అడ్వకేట్, అమలాపురం

నోటీసు
మహారాజశ్రీ రామచంద్రాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

Creditor I.P. 6/2019

Between:

1. బలుసు నాగేశ్వరరావు, తండ్రి: వీర్రాజు, వయస్సు 43 సంIIలు, వ్యాపారం, పులగుర్త, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి JCJ.
2. పైడిమర్రు విజయ రత్నకుమార్, తండ్రి: నరసింహం, హిందువు, వయస్సు 42 సంIIలు, వ్యాపారం, ఇంటి నెం. 1-132, మారేడుబాక, మండపేట మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు JCJ. -పిటిషనర్లు/ క్రెడిటార్స్

మరియు

1. చిగిలిపల్లి పైడినాయుడు, తండ్రి: పోతినాయుడు, వయస్సు 56 సంIIలు, నిల్, డోర్ నెం. 5-9-29, మండపేట, మండపేట మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు JCJ.
2. వెలగల వెంకట కృష్ణారెడ్డి, తండ్రి: తాతారెడ్డి, వయస్సు 40 సంIIలు, వ్యాపారం, డోర్ నెం. 1-13-119/ఎ, గోపి నగర్, యానాం, పాండిచ్చేరి, యానాం DMC.
3. వెలగల నాగమణి, భర్త: వెంకట కృష్ణారెడ్డి, వయస్సు 40 సంIIలు, హౌస్ వైఫ్, డోర్ నెం. -13-119/ఎ, గోపి నగర్, యానాం, పాండిచ్చేరి, యానాం DMC.
4. వైట్ల నారాయణరావు, తండ్రి: వెంకటరావు, వయస్సు 50 సంIIలు, పెనికేరు, ఆలమూరు మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు DMC. -రెస్పాండెంట్స్

పిటీషనర్లు పై నెంబరు ఐ.పి. గ్రంథములో 1వ రెస్పాండెంట్‌ని ఇన్సాల్వెంట్ (Insolvent) గా డిక్లేర్ చేయమని మరియు 2 నుండి 4వ రెస్పాండెంట్ పేరున 1వ రెస్పాండెంట్ ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసులో ది. 11-10-2018 తేదీ గల క్రియ దస్తావేజు నెం. 3031/2018 మరియు 3033/2018 మరియు ది. 22-10-2018 తేదీ గల క్రియ దస్తావేజు నెం. 3119/2018 ర్లు గల దస్తావేజులను రద్దుపరచమని కోరుచూ మొదలగు పరిహారములతో పిటీషను దాకలు చేసినందున సదరు పై ఐ.పి. గ్రంధములో శ్రీ కోర్టు వారు 1వ రెస్పాండెంట్ అయిన మీకు పలుమార్లు నోటీసులు పంపించినప్పటికి మీరు వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియపరచవలసినదిగా పై కోర్టు వారు ఆదేశించినందున పై ఐ.పి. గ్రంధములో మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **ది. 02-09-2024వ తేదీన పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా ఉదయం గంII 10.30 నిIIలకు** హాజరు అయ్యి మీ వాదనను తెలియపరచుకోవలెను. లేని ఎడల పై కోర్టు వారు మీకు పరోక్షముగా నిర్ధారించబడునని మీకు తెలియపరచడమైనది.

పి.వెంకటరావు
అడ్వకేట్, మండపేట

మండపేట
తేది:14-08-2024 సెల్: 9133101331

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు

I.A. No. 583/2023
M.V.O.P. No. 66/2022

Between:

శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, రాజమండ్రి -పిటిషనర్

మరియు

జి.ధర్మతేజ మరియు ఇతరులు ...ప్రపోజ్డ్ పార్టీలు

R-4: ముత్యాల దుర్గారావు, S/o. సత్తిబాబు, 25 సంIIలు, డోర్ నెం. 11-75, పోలీసు స్టేషను ప్రక్కన, రాజోలు, డ్రైవరు AP 39 EK 6101

R-5: బచ్చు చిట్టిబాబు, S/o. సూర్యనారాయణ, 37 సంIIలు, డోర్ నెం. 2-196, న్యూ కాలనీ, కడియం, ఓనరు AP 39 EK 6101

పై పిటిషనులో R4 & R5 లకు పంపిన నోటీసును ఇంటెన్సివ్‌గా తీసుకోనందున శ్రీ కోర్టు వారు **ది. 09-09-2024వ తేదీన** మీ హాజరు నిమిత్తమై వాయిదా వేసి వున్నారు. సదరు వాయిదా రోజు **ఉదయం 10.30 నిIIలకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరాలు తెలియజేయవలెను. లేని యెడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

K.S.LAXMI NARAYANA
రాజమండ్రి Advocate for Petitioner
09-8-2024 Rajahmundry

ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి

నేను దివి. **30-06-2024** న మా లాయర్ గారిని కలిసి ఈ క్రింద ఉదహరించిన దస్తావేజులను అందజేయుటకు కాకినాడ నుండి రాజమండ్రి ఉదయం 11 గంటలకు వచ్చి లాలాచెరువు సెంటర్ నుండి శ్రీరాంపురం వెళ్ళుటకు ఆటో ఎక్కి ఎ.వి.అప్పారావు రోడ్ దగ్గర ఆటో దిగి నా దగ్గర దస్తావేజులతో ఉన్న సంచిని పరధ్యానంగా మర్చిపోయినాను. సదరు ఆటో డ్రైవర్ కానీ మరి ఇతరులు కానీ ఆ దస్తావేజులను గుర్తించిన నాకు అందచేయగలరని అభ్యర్థిస్తున్నాను.

1. పంది సూర్యారావు పర్వత అచ్చాయమ్మకు రాసి ఇచ్చిన క్రియ దస్తావేజు **Doc. No. 1207/1990.**
2. పంది పెద్ద నూకరాజు పర్వత అచ్చాయమ్మకు రాసి ఇచ్చిన క్రియ దస్తావేజు **Doc. No. 1306/1990.**
3. పంది కాశీ విశ్వనాధం పర్వత అచ్చాయమ్మకు రాసి రాసి ఇచ్చిన క్రియ దస్తావేజు **Doc. No. 1307/1990.**
4. పంది గణపతి పర్వత అచ్చాయమ్మకు రాసి ఇచ్చిన క్రియ దస్తావేజు **Doc. No. 1308/1990.**
5. పంది అచ్చాయమ్మ పంది కాశీ విశ్వనాధంకు రాసి ఇచ్చిన తనఖా దస్తావేజు **Doc. No. 1315/1993.**

దలే సూర్యరావు
డోర్ నెం. 3-16బి-80, పోస్టల్ కాలనీ
శాంతి నగర్, కాకినాడ-3
సెల్: 96767 66647

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NARSIPATNAM CREDITOR I.P. No.4/2022

Between:
Sathi China Veera venkata Satyanarayana Reddy
...Petitioner (Creditor)

And:
Gavireddy Varalamma & 14 others
...Respondents

NOTICE

To,
Respondent No.5:
Siriki Suribabu,
S/o. Siriki Ramulu Aged 65 years,
R/o. D.No. 1-15, Ramalayam Street,
Gokivada Village,
Pithapuram Mandal, E.G.District.

Please take notice that the above named Petitioner has instituted the above IP to declare the respondents 1 to 3 as insolvents and for other reliefs. The Hon'ble Court was pleased to Order notice to you through this paper publication for your appearance either in person or through your counsel on **29-08-2024** and duly instructed and able to answer all material questions relating to the above I.P.No.4/2022 on **29-08-2024 at 10:30 A.M.** in default of your appearance on that day, the above IP will be heard and determined in your absence.

(By the Order of the Hon'ble Court)

P. SUBBA REDDY,
SRIKAGOLAPU VENKATA RAMANA
Advocates,
Visakhapatnam, Cell: 7386239666